# విషవృక్షం

శేకుమళ్ల కామేశ్వరరావు

"భారతదేశ సౌభాగ్యమే పల్లెటూళ్లు." "పల్లెటూళ్ళనుసంస్కరించాలి," "పట్టణాలను విడిచిపెట్టి పల్లెటూళ్ళకు చేరుకోండి." "పట్టభద్రులు ఒక్క సంవత్సరమేనా పల్లెటూరి సేవ చెయ్యనిదే, వారికి పట్టాలివ్వకూడదు" మొదలైన గ్రామోద్ధరణ వాక్యాలను, దాసారావు ఉన్నత తరగతులు చదువుకొంటూన్న కాలంనుంచీ వింటున్నాడు. మొత్తంమీద తాను గ్రామసేవచేసి దేశాన్ని ఉద్ధరించదలచుకొన్నాడు. వచ్చేనెలతో కళాశాలచదువు పూర్తవుతుంది. తనకి నచ్చిన పల్లెటూరుచేరి సేవచెయ్య సంకల్పించుకొన్నాడు.

అయితే మామూలు రస్తావిడిచి వెళ్లే ప్రతి మనిషికి ఏవో ప్రతిబంధకాలు బయలుదేరుతాయి. అతనికి ఇంటిలోనే పోరు బయలుదేరింది. ఇన్నాళ్ళూ అతనిచదువుకి పెట్టుబడిపెట్టి, పెంచి పెద్దచేసిన తల్లితండ్రులే ఓం ప్రథమంలో అడ్డు తగిలేరు. "నీవు అటువంటి అపరబుద్ధి విడిచిపెట్టు" అని అడ్డుపుల్లవేశారు.

"మీ మాటలు చెవినిపెట్టను. అది నా నిశ్చయం" అని దాసారావు కర్రవిర్చి పొయ్యిలో పెట్టినట్లుగా జవాబుచెప్పేడు.

కొడుకు చదువుకొన్నవాడే, చెడిపోతున్నాడే, చిన్నవాడే, జ్ఞానవంతుడు కావలసినవాడు వక్రమార్గాన్న పడిపోతున్నాడే! అని తల్లిదండ్రులు విచారించి, తాము ఎంతదూరం చెప్పిచూడాలో, అంతదూరం చెప్పిచూశారు. కాని అతను లొంగుబాటుకి రాలేదు. వాళ్లు విధిలేక ఊరుకొన్నారు.

దాసారావు ఉంటూన్న పట్టణానికి పరిసరంలో ఉల్లిపల్లె అనే గ్రామం ఉంది. దానిని అతను ఉద్ధరించదలచుకొన్నాడు. ఉల్లిపల్లెగాక మరొక పల్లెటూరెందుకు వెళ్ళలేదు, అంటే—ఉల్లిపల్లె అతను ఉంటూన్న, చదువుకొన్న, అతని తలిదండ్రులుంటూన్న పట్టణానికి కొంతచేరువలోఉంది. తమకి అంత చేరువలో ఉండదలచుకొన్నందుకు తల్లిదండ్రులు ఏమపులోనే సంతోషించేరు.

దాసారావుకి వివాహంకాలేదు. తండ్రి అతని మీద అధారపడనవసరంలేదు. కాబట్టి అతనికి సంసారం బెడదలేదు.

అతను ఉల్లిపల్లెలో ఒక చిన్న గది చవకగా అద్దెకు తీసుకొని, దానిలో ప్రవేశించేడు.

అయితే గ్రామోద్ధరణ ఏ మోస్తరుగా ప్రారంభించాలి అని ప్రశ్న. అతనికి ఇంకా ఆలోచనలు సరిగా ఏర్పడకపోవడంచేత మథించి మథించి, నికరమైన పద్ధతిని అనుసరించ దలుచుకొన్నాడు.

ఊళ్ళోకి ఎవరో కొత్త మనిషి వచ్చేడని, చిన్నలు, పెద్దలు, స్త్రీలు, అందరూవచ్చి దగ్గిరగాపోలేక దూరంగానే దాసారావుని దర్శించిపోయేరు. ఇంతెందుకు? అతను ఉన్న గదిముందు అరుగుమీదే కొందరు గ్రామీణులు అహర్నిశలు రెడ్డికం వేసుకొని కూర్చున్నారు. కొందరు అతన్ని బోలెడన్ని ప్రశ్నలువేసి, పుట్టు పూర్వోత్తరాలు, గుట్టుమట్టు ఊడలాగేరు. దాసారావు ఒకందుకు సంతోషించేడు. "పల్లెటూళ్ళో దొంగతనాలు జరగవంటే ఆశ్చర్యంలేదు. కొత్తమనిషి వచ్చేడంటే వాడి ఆనుపానులు ఎక్కలాగి విడిచిపెడతారు. ఇహ వాడేమి దొంగతనంచేసి చస్తాడు" అనుకొన్నాడు.

ఒకరోజు పొద్దున్న ఒక తాడెత్తు పెద్దమనిషి ఇంతపొడుగు చుట్ట నోటిలో పెట్టుకొని పొగ విడుస్తూ ఉండేలుబద్దలాగు వంగి గదిలోకి దూరి వచ్చేడు.

అతనివైపు ఆశ్చర్యపోయి చూశాడు దాసారావు.

ఆ పెద్దమనిషి నీర్కావి ముతకధోవతి కట్టుకొన్నాడు. ఆ ఆజానుబాహువు భుజంమీద మూరెడు తువ్వాలు పడవేసి, కిందపడిపోకుండా మెడవంచి నొక్కిపెట్టేడు. అతను వచ్చి చాప మీద పూర్తిగా కూర్చోకుండా "అయితే మీది

"ఏపక్షమంట?" అని బద్దలుకొట్టినట్టుగా సంభాషణ మొదలుపెట్టేడు.

దాసారావు విచిత్రపోయేడు. "పల్లెటూళ్లలో రాజకీయాలు ఇంతటి కాఢ్లాగు తెగ పాకిపోయేయి అనడానికి ఇదొక నిదర్శనం కాబోలు" అని తలపోస్తూ గడుసుతనాన్ని అభినయించి "మీది ఏ రాజకీయపు పార్టీయో మొదట సెలవివ్వండి" అని మర్యాదగా ప్రశ్నించేడు.

పెద్దమనిషి "ఆ పప్పులిక్కడ ఉడకవండోయి! రాజకీయాలు ఈ చుట్టుపట్లకు రావు!" అని హామీ ఇచ్చేడు.

వెంటనే దాసారావుకి మరొక ఊహ పోయింది. "కులకక్షలంటారు. కమ్మ రెడ్డి, కాపు, తెలగా నాయడు ఇత్యాది కక్షలతో పల్లెటూళ్లు కుళ్ళి కంపుకొడుతున్నాయి. బహుశ అది కాబోలు ఈ పెద్దమనిషి ఉద్దేశం" అనుకొని "నాకు మీ కులకక్షలతో సంబంధంలేదు" అని ప్రకటించేడు.

పెదమనిషి అదీకాదు అన్నట్టుగా తల అడ్డంగా ఊపేడు.

దాసారావు ఇంకా ఊహిస్తూ "ఇక్కడ కరణంపార్టీ, మునసబుపార్టీ ఉన్నాయి కాబోలు" అనుకొంటూండగా, అతన్ని ఆలోచనా సముద్రంనుంచి ఉద్ధరించ దలుచుకొన్నట్టుగా పెద్దమనిషి "మీది యెంకయ్యగారి పార్టీయా, మరి సిట్టెయ్యగారి పార్టీయా?" అని సూటిగా ప్రశ్నించేడు.

దాసారావు నిర్ఘాంతపోయేడు. తెప్పరిల్లి "వెంకయ్యగారెవరో నే నెరగను క్షమించండి!" అని ఉన్నదున్నట్టుగా చెప్పేడు.

పెద్దమనిషికి నవ్వొచ్చింది. "ఈ ఊర్లో పసిపిల్ల దగ్గిరనుంచి ఏదో ఒక పార్టీకి చెంది ఉండగా మీ దేపార్టీ అంట మరి?" అని మళ్ళీ అడిగేడు.

"నాకు నిజంగా తెలియదు. క్షమించండి!" అని దాసారావు నమ్రత వహించేడు.

పెద్దమనిషి నవ్వుకొంటూ లేచి వెళ్ళేడు.

ఆ ఊళ్లో వెంకయ్యగారు, చిట్టెయ్యగారు అనే ఇద్దరు ధనిక భూస్వాములున్నారనీ, ఊళ్లో కక్షలన్నిటికి వాళ్లేమూలకారణమని దాసారావుకి తర్వాత తెలియ వచ్చింది.

దాసారావు ఒకరోజు సాయంత్రం ఊళ్లోకి షికారు బయలుదేరేడు. ఊరంతా జానెడు బెత్తెడు మాత్రమేఉంది. రోడ్లమీద గొడ్లునడచినప్పుడెల్లా దుమ్ము మేఘం లేస్తూంది. పైగా ఆ దారి కాలవలాగుంది. వర్షాకాలంలో అదొకవాగులాగు ప్రవహిస్తుందని, ఆ పల్లెటూరు పుట్టిననాటినుంచి ఆరోడ్డు మరమ్మత్తు ఎరగదు. ఫల్లాకులు చెత్త, సుక్కు స్వేచ్ఛగా ఎగురుతున్నాయి. అమావాశ్య రాత్రయినాసరే వీధిలో తడుముకుంటూ వెళ్ళవలసిందే కాని వీధిలాంతరులనేవి పేరుకేనా లేవు.

పట్నంనుంచి ఉల్లిపల్లె రెండుమైళ్ళ దూరముంది. ఎగుడుదిగుడు డొంకే మార్గం. ఆడొంక వరిపొలాల మధ్య ఉండి అదొకరకం కాలవలాగుంది. డొంక వచ్చివచ్చి ఒక పంటకాలవ దగ్గర ఆగిపోతుంది. కాలవకి అడ్డంగా రెండు తాటిబొందలు పడవేశారు. ఎవరువెళ్ళినా వాటిమీద నడిచి ఊళ్లోకి వెళ్ళవలసిందే! కొత్తవాళ్లు జడిసి లోతులేని కాలవలోపడి లేవటం కద్దు.

ఊరిని అంటిపెట్టుకొనే వరిపొలాలుండడంచేత ఊరినిండా దోమలు, వాటి సంబంధమైన వ్యాధులు ఊరు పెరగడానికి లేదు. అందుచేత ఉన్న జాగాలోనే కొత్త ఇళ్లు కట్టుకుని అంతా క్రిక్కిరిసి ఉంది. వేరే పాయిఖానాలు లేనందువల్ల దారిపక్కలు పాడుపాడు! ఆ ఊరికి మంచినీళ్ళ చెరువు అనబడేదొకటుంది. దానిలోనే మనుష్యుల, గొడ్ల స్నానాలు, బట్టలుతకడాలు ఇత్యాది ప్రక్షాళనలు.

ఉల్లిపల్లెలోని ఇద్దరు ధనవంతులకు చెరొక వార్తాపత్రిక వస్తుంది అది సాధారణంగా పడవేసిన చోటినుంచి కదలదు. పఠనమందిరమన్నది లేనేలేదు. అసలు మొదట పాఠశాలే లేదు, ఒక ఆసుపత్రిలేదు, ఒక తపాలాఫీసు లేదు. ఇన్ని విధాలుగా వెనబడివున్న గ్రామాన్ని చూసి "ఇదొక విషవృక్షం" అని దాసారావు తలపోసి విచారించేడు. కాని తన సంస్కారగుణానికి పుష్కలంగా పని దొరికినందుకు ఒకవైపు సంతోషించేడు.

దాసారావు దీర్ఘంగా ఆలోచించేడు. ఊరివారిందరిని ఒకచోటుకి రావించి ఒక మహాసభ జరిపించి, దానిలో అన్నివిషయాలు సాకల్యంగా చర్చించి ఒక చహారా ఏర్పరచి, దానిని తు. చ. తప్పకుండా అనుసరించదలచుకొన్నాడు. ఆ విష

యమై తన దగ్గిరకి వచ్చిన చిన్న పెద్దలను కదిపి చూసేడు "మీరు చిట్టెయ్యగారితో ముచ్చటించి చూడండి" అని, మరికొందరు "మీరు వెంకయ్య గారితో మాట్లాడి చూడండి!" అన్నారు. వారిద్దరు ఊరికి పెద్దలు, వారి సహాయం లేనిదే యేపనీ జరగదని దాసారావు గ్రహించి,

"నేను మొదట చిట్టెయ్యగారిని కలుసుకొంటాను. సంపూర్ణంగా చర్చిస్తాను. తర్వాత వెంకయ్యగారిని కలుసుకొని ముందు మార్గం నిర్ణయించుకొంటాను" అని ఆలోచించేడు.

అతను చొక్కామీద కండువా వేసుకొని, తలచినప్పుడే శుభముహూర్తమని మాండవ్య మహర్షి సిద్ధాంత మనుకొంటూ బయలుదేరేడు. చిట్టెయ్యగారిల్లు చేరుకొన్నాడు. ఆయన దర్శనార్థమై వచ్చినట్లుగా కబురుచేశాడు. అరగంట సేపయింది. ఎక్కడా ఉలుకు, పలుకు లేదు. బహుశా ఆయన ఏదో ముఖ్యమైన పనిలో దిగబడి ఉంటాడని ఊహించేడు. అంతేగాని చిట్టెయ్యగారు తన గౌరవం ఇనుమడించడంకోసం వేస్తూన్న ఎత్తుని గ్రహించలేక పోయేడు.

దాసారావు నమస్కారం చెయ్యగా ఆయన తీవిగా అందుకొన్నాడు. దాసారావుయొక్క అట్టువుట్టు ఆనవాళ్లు అంతకు ముందే తన పార్టీదారుల ద్వారా విని కూడా ఆయన ఏమీ ఎరగనట్టుగా "మీరు ఎవరు?" అని ముక్తసరిగా ప్రశ్నించేడు.

దాసారావు తనను పరిచయం చేసుకొన్నాడు.

ఏదో కబుర్లమీద దాసారావు ఉల్లిపల్లెలోని లోపాలను ముచ్చటించేడు.

చిట్టెయ్యగారు ఊకొట్టకుండా విన్నాడు.

దాసారావు ఇంకా ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. చిట్టెయ్యగారి మనస్సులో, దాసారావు తమ ఊరి వృక్షంలో ప్రవేశించిన ఒక వేరు పురుగు అనే భావం ముద్రపడింది. ఆయన "మళ్లీ కలుసుకొన్నప్పుడు తక్కినవి చూసుకొందాం లెండి" అని ముక్తసరిగా తేల్చివేశాడు.

దాసారావు ఎంతమాత్రం నిరుత్సాహపడలేదు. దుర్గమ దుర్గంలోకి దారి చేసుకొంటూన్నట్లుగా తలపోశాడు.

అతను లేచివచ్చేడు. వెంకయ్యగారి దర్శనం కూడా చేసి చర్చించ దలుచుకొన్నాడు. ఆ ఊపుమీదే బయలుదేరి వెంకయ్యగారి యింటికి వెళ్లి "ఆయన దర్శనంకోసం వచ్చేను" అని కబురుచేశాడు ఒక గంట సేపయింది. ఏ సమాధానం రాలేదు. వెళ్ళిన మనిషి అంతకీ రాడు, ఇంతకీ రాడు. దాసారావుకి విసుగు పుట్టింది. ముళ్లమీద కూర్చునట్లుగా ఉంది. కాని కార్యసాధనకి ఇవన్నీ అంగాలని హితంచెప్పుకొన్నాడు. ఏమయినా వెంకయ్యగారి దర్శనమవలేదు. "ఇంక ఎంతసేపు కూర్చోను. ఉండమనీ లేదు, పొమ్మనీ లేదు సమాధానం. ఈ రోజు కాకపోతే మరొక రోజయినా దర్శన మివ్వకపోతాడా!" అని ఆశపడుతూ చక్కాపోయేడు.

వెంకయ్యగారు కారాలుమిరియాలు నూరుతున్నాడు. దాసారావు చిట్టెయ్యగారి గుమ్మం తొక్కిన ఉత్తర క్షణంలోనే వెంకయ్యగారికి తెలిసిపోయింది. "నా అంకటివాడు ఉండగా ఈ దాసారావు మొదట చిట్టెయ్యదగ్గరికి వెళ్ళి, నాకు అమర్యాద కలిగిస్తాడా! చిట్టెయ్య ఈ ఊరికి రాజనుకొన్నాడా? ఈ దాసారావుగారి అంతు కనుక్కొంటాను కాదూ! ఈ ఊళ్ళో ఎలా నిలుస్తాడో చూస్తాను!" అంటూ పంతం పట్టేడు.

దాసారావు సాయంత్రం కనుచీకటి వేళప్పుడు మామూలుగానే ఊరవతల పొలాలవైపు షికారు వెళ్ళేడు. అతన్ని కొంతదూరం వెళ్ళనిచ్చి డొంకలచాటునుంచి రాళ్ళవర్షం బయలుదేరింది. మనిషి ఒక్కడూ కనబడడు. పైగా చీకటి పడుతూంది. దాసారావు అరిచిచూశాడు. సమాధానంలేదు. రాళ్ళవర్షంమాత్రం తీవ్రతరమైంది. అతనికి దిక్కు తోచలేదు. కేకలు పెట్టేడు. రాళ్ళు గట్టిగా తగలగా, అరుపులు ఏడ్పుగా పరిణమించేయి. ఒకరాయి నేరుగావచ్చి కణతకి తగిలింది. కెవ్వున కేకవేసి కింద పడిపోయేడు. స్పృహ తప్పిపోయింది.

దాసారావు స్పృహలేకుండా పడిపోయినట్టు పట్టణంలోని అతని తల్లిదండ్రులకు ఉత్తర క్షణంలోనే కబురు తెలిసింది. వారు బండి చేయించుకొని నిముషాలమీద వెళ్ళేరు. పరిస్థితి చూసి విచారించేరు. కొడుకుని బండిమీద వేసుకొని పట్టణంలో ఆసుపత్రికి చేర్చేరు.